సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం ׀ 27 ׀ అక్టోబర్ ׀ 2023



ఆకట్టుకున్న ఆయుధాల ప్రదర్శన

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన పోలీస్ ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. -8లో



ముగిసిన పంట నమోదు ప్రక్రియ

జిల్లాలో 2023 ఖరీఫ్ సీజన్ పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రా నాయక్ గురువారం తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.280
రెండోరకం	రూ.110	రూ.200



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 345 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	345	525
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 201.060 కిలోలు

బడుగులకు కొత్త వెలుగు

- జిల్లాలో 63,937 ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఉచిత విద్యుత్
- ప్రతి ఇంటికి నెలకు 200 యూనిట్లు సరఫరా
- ప్రభుత్వంపై నెలకు రూ.1.77 కోట్ల భారం
- 48 నెలల్లో రూ.85.08 కోట్లు భరించిన ప్రభుత్వం



బి.కొత్తకోట: నిరుపేద ఎస్సీ, ఎస్టీలు వినియోగించే గృహ విద్యుత్‌కు పైసా బిల్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఆ వర్గాలకు అండగా నిలుస్తోంది. ఉచితంగా ఇళ్లకు సరఫరా అందిస్తూ విద్యుత్ వెలుగులు పంచుతోంది. విద్యుత్ చార్జీల భారం పేదలపై పడకుండా ప్రభుత్వమే భరించి బిల్లులను డిస్కంలకు చెల్లిస్తోంది. ప్రతిఇంటికి నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని తూ.చ. తప్పకుండా ఆచరణలో అమలు చేస్తోంది. దీనితో పేదలైన ఎస్సీ, ఎస్టీలకు ఎంతో ఉపశమనం కలుగుతోంది. ప్రతినెలా బిల్లుల చెల్లింపునకు ఎదురుచూడాల్సిన పరిస్థితి తప్పింది. అన్నమయ్య జిల్లాలో 51,169 ఎస్సీ గృహాలు, 12,768 ఎస్టీ గృహాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. దీనికోసం పైసా కూడా వసూలు చేయడం లేదు. 200 యూనిట్ల వినియోగం దాటిన గృహాలకు మాత్రమే విద్యుత్ బిల్లు వసూలు చేస్తున్నారు.

నెలకు రూ.1.77 కోట్ల భారం

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన ప్రతి కుటుంబం 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా పొందవచ్చు. వీటి బిల్లుల భారాన్ని ప్రభుత్వం భరించి చెల్లిస్తోంది. జిల్లాలో ఈ కుటుంబాలకు నెలకు రూ.1.77 కోట్ల బిల్లులు భరిస్తుండగా పేదలైన ఎస్సీ, ఎస్టీలపై ఆర్థిక భారం తప్పింది. ఈ లెక్కల్లో భాగంగా కుటుంబాల సంఖ్య పెరిగితే బిల్లుల భారం పెరుగుతుంది. ప్రస్తుత టారీఫ్ ప్రకారం 30 యూనిట్లలోపు యూనిట్‌కు రూ.1.90, 31 నుంచి 75 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.3, 76 నుంచి 125 యూనిట్ వరకు రూ.4.50, 126 నుంచి 225 యూనిట్ల వరకు యూనిట్‌కు రూ.6 వసూలు చేస్తున్నారు. ఈ బిల్లుల భారమంతా ప్రభుత్వమే భరించి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వెలుగులు ఇస్తోంది.

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ గృహ కనెక్షన్లు

సబ్-డివిజన్	ఎస్సీ గృహాలు	నెల బిల్లు (రూ.లక్షల్లో)	ఎస్టీ గృహాలు	నెల బిల్లు (రూ.లక్షల్లో)
మదనపల్లె	15,016	34.64	4,177	11.22
పీలేరు	10,212	25.29	2,048	4.79
రాయచోటి	8,797	24.29	2,517	7.30
రాజంపేట	17,144	59.14	4,026	10.59



▶▶రూ.85 కోట్ల భారం



ఆగష్టు ఒకటి 2019 నుంచి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ ఉచిత విద్యుత్ అందించే పథకాన్ని వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు చెందిన మొత్తం కుటుంబాల్లో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న 63,937 కుటుంబాలు పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయి. ఈ కుటుంబాలకు నెలకు రూ.1.77 కోట్ల బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుండగా పథకం ప్రారంభమైన నాటి నుంచి ఈనెల వరకు రూ.85.08 కోట్ల భారాన్ని భరించింది. ఎస్సీ, ఎస్టీలపై ఈ భారం తప్పించిన ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది.

ధ్రువీకరణ ఉండాలి



ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తోంది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే సంబంధిత వ్యక్తి తాను ఎస్సీ లేదా ఎస్టీ అని నిర్ధారించే కుల ధ్రువీకరణ పత్రాన్ని డిస్కం ఏఈలకు సమర్పించాలి. దరఖాస్తు చేసుకున్న తర్వాత సర్వీసులు మంజూరు, కనెక్షన్ ఇస్తాం. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలి.
–ఎస్.శ్రీనివాసులు, ఓఎస్టీ, ఎస్పీడీసీఎల్

ప్రభుత్వం ఆదుకుంది



గృహాలకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్న ప్రభుత్వం ఎస్టీలను ఆదుకుంటూ అండగా నిలిచింది. నెలనెలా బిల్లులు చెల్లించే కష్టాల నుంచి మమ్మల్ని రక్షించింది. 200 యూనిట్ల వినియోగం గృహ అవసరాలకు సరిపోతుంది. గతంలో ఇలా ఉచిత విద్యుత్‌ను ఇళ్లకు ఇవ్వలేదు. –మురళీనాయక్, రామానాయక్‌తాండా, పెద్దమండ్యం

ఉచిత విద్యుత్‌తో ఊరట



మా ఇళ్లకు ఉచిత విద్యుత్ ఇస్తుండటం ఎంతో ఊరట కలిగిస్తోంది. కూలీ పనులు చేసుకునే నాలాంటి వారికి ప్రతినెలా విద్యుత్ బిల్లుల చెల్లింపు ఆర్థికంగా మారింది. ప్రభుత్వం నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నందున రూ.500 నుండి రూ.600 ఆదా అవుతోంది. ఈ సొమ్ముతో కుటుంబ ఇతర అవసరాలను తీర్చుకునేందుకు వినియోగించుకొంటున్నాం. –దేగాని చంద్ర, కనసానివారిపల్లె కాలనీ, కురబలకోట

‘కౌశల్’కు దరఖాస్తులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ శ్రీరాం పురుషోత్తం

రాయచోటి అర్బన్: భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ శాసన సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌశల్ -2023 పరీక్షకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా విద్యాధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆయన కౌశల్-2023 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌశల్ సైన్స్ క్విజ్ పోటీకి హాజరయ్యేవారు 8, 9, 10 తరగతుల విద్యార్థులు ప్రత్యేక టీమ్‌గా ఏర్పడాలన్నారు. క్విజ్‌లో పాల్గొనేందుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులు పోటీలో పాల్గొనేందుకు తప్పనిసరిగా తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సిలబస్‌గా 8, 9, 10 తరగతుల గణితం, సైన్స్, సాంఘికశాస్త్రం, విజ్ఞానశాస్త్ర రంగంలో భారతీయుల కృషి అంశాలను నిర్ణయించారన్నారు. ప్రాథమిక పరీక్ష డిసెంబర్ 6, 7, 8 తేదీలలో ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. జిల్లాస్థాయి పోటీలు డిసెంబర్ 20వ తేదీన, రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబర్ 30వ తేదీన జరుగుతాయన్నారు. క్విజ్‌లో పాల్గొనదలచిన విద్యార్థులు నవంబరు 5వ తేదీ లోపు www.bvmap.org వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల విజేతలకు బహుమతులు గవర్నర్ చేతుల మీదుగా అందచేయబడతాయన్నారు. అర్హులైన విద్యార్థులంతా కౌశల్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం జిల్లా కో-ఆర్డినేటర్ మధుమతిని 8985541699 నంబరులో, జిల్లా జాయింట్ కో-ఆర్డినేటర్ గోవింద నాగరాజును 90005 74457 నంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకుడు శ్రీనివాసరాజు, ఏపీ ఉపాధ్యాయ సంఘం నాయకుడు నరసింహులు, జిల్లా సైన్స్ అధికారి ఓబుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట రూరల్: మండల పరిధిలోని నారంరాజుపల్లి వద్దనున్న జవహర్ నవోదయలో వచ్చే విద్యాసంవత్సరానికి 9వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గీత గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి విద్యనభ్యసించే విద్యార్థులు అర్హులని తెలియజేశారు. సెప్టెంబరు 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. 2024 ఫిబ్రవరి 2వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ఆర్థిక సహాయం



మల్లికార్జున కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న అదనపు ఎస్పీ వి.బి.రాజ్‌కమల్

రాయచోటి: విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు పి.మల్లికార్జున కుటుంబానికి రూ.1.75 లక్షల ఆర్థికసాయాన్ని జిల్లా అదనపు ఎస్పీ వి.బి.రాజ్‌కమల్ గురువారం అందజేశారు. రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ క్రిష్ణారావు ఆదేశాల మేరకు ఈ మేరకు చెక్కును పంపిణీ చేశారు. మృతుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఏఓ కృష్ణుడు, జూనియర్ అసిస్టెంట్ ఇందుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకులో ఈ-స్టాంప్‌లు



ఖాతాదారుడికి పేటీఎం మిషన్‌ను అందిస్తున్న ఝాన్సీ

రాజంపేట టౌన్: ప్రజల సౌకర్యార్థం డీసీసీ బ్యాంకులో ఈ-స్టాంప్‌లను అందుబాటులో ఉంచినట్లు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ తెలిపారు. స్థానిక డీసీసీ బ్యాంక్‌లో కరెంట్ అకౌంట్ ఖాతాదారులకు గురువారం పేటీఎం మిషన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈస్టాంపులు కావాల్సిన వారు డీసీసీ బ్యాంకులో కొనుగోలు చేయవచ్చని తెలిపారు. పేటీఎం మిషన్ల ద్వారా ఖాతాదారులు తమ లావాదేవీలను కొనసాగించవచ్చన్నారు. లావాదేవీలను బట్టి రుణాలు కూడా మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ కె.రాజేంద్రకుమార్, ఏజీఎం నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలో ఈ-క్రాప్ జాబితా



ఆర్‌బీకే కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బందికి క్షేత్రస్థాయి సమావేశం నిర్వహించిన దృశ్యం

లక్కిరెడ్డిపల్లి: 2023 సంవత్సరానికి సాగు పంటకు సంబంధించిన ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలను గ్రామ రైతు భరోసా కేంద్రాలలో అతికించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో డివిజన్ పరిధిలో రామాపురం, వీరబల్లి, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు మండలాలకు చెందిన ఆర్‌బీకేలలో పనిచేస్తున్న సిబ్బందికి క్షేత్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆర్‌బీకే పరిధిలో గ్రామ సభలు ఏర్పాటు చేసి ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతుల వివరాలను గ్రామ సభలలో సమగ్రంగా చదివి వినిపించాలన్నారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సవరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ బాబు రమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు తెలుసుకోవాలి



బహుమతులను అందిస్తున్న సోలార్ పవర్ గ్రిడ్ డీజీఎం చంద్రశేఖర్

గాలివీడు: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే సంస్థలలో అవినీతి నిర్మూలనకు గల ప్రజా ప్రయోజన చట్టాల మీద ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సోలార్‌పవర్ గ్రిడ్ డీజీఎం చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని రవిచంద్ర మీడియం పాఠశాల విద్యార్థులకు గురువారం ఆయన చట్టాలపై అవగాహన కల్పించారు. అవినీతి ఏ స్థాయిలో జరిగినా అది దేశ అభ్యున్నతికి ప్రమాదమన్నారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు దామోదరం, ఆనంద్, జేఈ అమర్‌నాథ్, పాఠశాల ప్రిన్సిపాల్ నూతన నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య, సౌమ్యనాథుల సన్నిధిలో ఒరిస్సా హైకోర్టు జడ్జి

ఒంటిమిట్ట/నందలూరు(రాజంపేట): ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులు, నందలూరులోని సౌమ్యనాథస్వామిని ఒరిస్సా హైకోర్టు జడ్జి గౌరి శంకర్ ఛత్రపతి గురువారం కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల అర్చకులు లాంఛనాలతో వారికి స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షణ కావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్రను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.



ఒంటిమిట్టలో జడ్జి గౌరి శంకర్ ఛత్రపతి, వారి కుటుంబ సభ్యులు

ఆకేపాడు హెచ్‌ఎంకు ప్రధాని ప్రశంస

రాజంపేట టౌన్: అన్నమయ్య జిల్లా రాజంపేట మండలంలోని ఆకేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీవీ.రమణయ్యశెట్టిని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసిస్తూ లేఖ పంపారు. ఈ విషయాన్ని రమణయ్యశెట్టి గురువారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది మార్చి నెలలో వర్చువల్‌గా పరీక్ష పై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించగా సూచనలను తెలియచేసినందుకు ప్రధాన మంత్రి ప్రశంసిస్తూ లేఖ పంపడం ఆనందంగా ఉందని తెలిపారు. రాబోయే 25 ఏళ్లల్లో భారతదేశం అగ్రదేశంగా నిలిచేందుకు ప్రతిభావంతులైన యువతను దేశానికి అందించాల్సి ఉందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చి దిద్దుతారన్న నమ్మకం ఉందని పీఎం ఆ లేఖలో పేర్కొన్నారని తెలిపారు. హెచ్‌ఎంను పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు.



హెచ్‌ఎంను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నవంబర్ 15లోగా స్టేడియం పూర్తి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పరిధిలో 32.62 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను నవంబర్ నెల 15లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి సమీపంలోని నక్కలవాండ్లపల్లి వద్ద 32.62 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. స్టేడియం ల్యాండ్ స్కేపింగ్ పనులు, స్టేడియం సరిహద్దుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు, స్టేడియం ప్రధాన పెవిలియన్ భవన నిర్మాణ ప్రగతి, స్టేడియం నుంచి ప్రధాన రోడ్డు నిర్మాణ ప్రదేశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ, ఆర్ అండ్ బీ, మునిసిపల్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచి మట్టిని తెచ్చి గ్రౌండ్‌లో 2 ఇంచల మేర వేసిన పచ్చదనం కోసం గడ్డి విత్తనాలను చల్లాలన్నారు. స్టేడియం చుట్టూ నాటిన చెట్లకు ప్రతిరోజూ నీటిని అందించాలన్నారు. పెవిలియన్ ముందు భాగం నుంచి ప్రధాన రోడ్డుకు అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలని, శుక్రవారం నుంచి ఆ పనులను కూడా వెంటనే ప్రారంభించాలని అధికారులకు తెలిపారు. పెవిలియన్ నిర్మాణ భాగం ఎడమవైపున ఆక్రమణలు తొలగించి స్థలం చుట్టూ రక్షణకు ఫెన్సింగ్ వెంటనే ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పెవిలియన్ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్, వాలీబాల్, టెన్నిస్, బాస్కెట్‌బాల్ ఓపెన్ కోర్టులు కూడా ఏర్పాటు చేయాలని చెప్పారు. పెద్ద హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, ఆర్ అండ్ బీ, మునిసిపల్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో నవంబర్ 15లోగా పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ జిల్లా అధికారి సహదేవరెడ్డి, మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, తహసీల్దార్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

▶▶ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ తనిఖీ

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న గోడౌన్‌లో భద్రపరచబడిన ఈవీఎంలను అక్కడ జరుగుతున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. అక్కడే ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎఫ్ఎల్‌సీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ, ఈవీఎంల జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఎంసి మద్దిలేటి, డీఆర్ఓ సత్యనారాయణ, తహసీల్దార్ ప్రేమంతకుమార్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్గో.. లెట్స్ గో

- ఆర్టీసీలో ప్రచార మాసోత్సవం ప్రారంభం
- అందిస్తున్న సేవలపై వివిధ వర్గాలకు అవగాహన
- ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి

మదనపల్లె సిటీ: పారదర్శక సేవలు… ఏజెంట్ల కమీషన్ పెంపు.. చిల్లర సమస్యలకు చెక్ పెడుతూ డిజిటల్ పేమెంట్లు, బుకింగ్ సమయంలోనే చార్జీల చెల్లింపు…వందశాతం డోర్ డెలివరీ..వెరసి ఇక ఆర్టీసీ కార్గో వినూత్నంగా మారనుంది. జిల్లాలో మదనపల్లె-1, -2, రాయచోటి, పీలేరు, రాజంపేట డిపోలున్నాయి. ఈ డిపోల పరిధిలో గురువారం నుంచి కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం ప్రారంభమైంది. 2017లో ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభించారు. ఇపుడు సేవలు విస్తృతం చేయడమే కాకుండా సమర్థవంతంగా నిర్వహించడానికి కసరత్తు చేస్తున్నారు. ఏజెంట్లకు కమీషన్ 10 శాతం నుంచి 15 శాతానికి పెంచారు. మరో వైపు బల్క్ బుకింగ్ చేస్తున్న వారికి 5 శాతం నుంచి 10 శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నారు. ఈ క్రమంలోనే రోజువారీ ఆదాయం పెంచడానికి కృషి చేస్తున్నారు.

కార్గోలో డిజిటల్ పేమెంట్లు

ఆర్టీసీలో కార్గో సేవలు పారదర్శకంగా అందించడానికి యాజమాన్యం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. ఆర్టీసీ బస్టాండుతో పాటు ఇతర ప్రాంతాల్లోని కార్గో సెంటర్లలో డిజిటల్ పేమెంట్‌లు అమలు చేస్తున్నారు. అలాగే ఫోన్‌పే, గూగుల్ పే తదితర సౌకర్యాలను కల్పిస్తున్నారు. అన్ని కార్గో సెంటర్లలో డిజిటల్ పేమెంట్ సౌకర్యాలను ప్రారంభించారు.

వందశాతం డోర్ డెలివరీకి ఏర్పాట్లు

ఇంటికే పార్సిళ్లు, కొరియర్‌లను పంపిణీ చేసే డోర్ డెలివరీ వ్యవస్థను మరింత విస్తృతం చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే ఆర్టీసీ డోర్ డెలివరీకి ప్రజల్లో ఆదరణ ఉంది. ఆర్టీసీ యాజమాన్యం నిర్వహించిన సర్వేలో 66 శాతం మంది ఖాతాదారులు డోర్ డెలివరీకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడైంది. పట్టణాలలో 10 కిలోమీటర్ల పరిధి వరకు డోర్‌డెలివరీ చేయనున్నారు. డోర్ డెలివరీ చేయడానికి గతంలో జోన్ల వారీగా కాంట్రాక్టుకు అప్పగించారు. ఇకపై రాష్ట్రం మొత్తం మీద సింగు సొల్యూషన్స్ అనే సంస్థకు అప్పగించారు. దీని వల్ల ఏదైనా సమస్య తలెత్తినా ప్రధాన కార్యాలయం నుంచే సరిచేసే వీలుంటుందని భావిస్తున్నారు.



మదనపల్లెలోని ఆర్టీసీ కార్గో సెంటర్

జిల్లాలోని ఐదు డిపోల్లో కార్గో ఆదాయం వివరాలు

నెల	ఆదాయం
మే- 2023	37.07 లక్షలు
జూన్-2023	43.36 లక్షలు
జులై-2023	39.06 లక్షలు
ఆగస్టు-2023	35.11 లక్షలు
సెప్టెంబర్-2023	31.36 లక్షలు

డోర్ డెలివరీ ధరల వివరాలు

పార్సిల్/కొరియర్	ధర
ఒక కిలో	రూ.18
ఆరు కిలోలు	రూ.30
పది కిలోలు	రూ.36
25 కిలోలు	రూ.48
25-50 కిలోలు	రూ.59



5 నెలల్లో డోర్ డెలివరీలు : 3,841

▶▶విస్తృతంగా..



ఆర్టీసీ యాజమాన్యం డోర్ డెలివరీ సేవలను విస్తృతం చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి బాగా తీసుకుపోవాలని ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా నిన్నటి (అక్టోబర్ 2) నుంచి వచ్చే నెల 25 వరకు నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఆర్టీసీ పార్సల్, కొరియర్, సరుకు రవాణాలో భాగ స్వాములయ్యే కాంట్రాక్టర్లు, ఏజెంట్లు, ఆపరేటర్లతో సమావేశం నిర్వహించనున్నారు. అంతేకాకుండా బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు, అపార్టుమెంటులకు వెళ్లి ఆర్టీసీ డోర్ డెలివరీ సదుపాయంపై వివరించనున్నారు. ఇంకా ఫ్లెక్సీలు, కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. డిపోల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

సేవలపై విశ్వసనీయత



ఆర్టీసీ కార్గో సేవలపై ప్రజల్లో ఎంతో విశ్వసనీయత ఉంది. ఆర్టీసీ ద్వారా బుక్ చేసిన సరుకులు, పార్సిళ్లు, కొరియర్లను ఇతర సంస్థలకు దీటుగా రాష్ట్రంలో 24 గంటల్లోనే డెలివరీ చేస్తున్నాం. ప్రజాదరణ పొందిన ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలను విస్తృతం చేస్తున్నాం. దీని వల్ల ప్రజలకు మరింత చేరువవుతాం. డోర్ డెలివరీ ప్రచారం తర్వాత పికప్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెస్తాం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – రాము, జిల్లా ప్రజారవాణాధికారి, రాయచోటి

సమర్థవంతంగా..



ఆర్టీసీ కార్గో సేవలను సమర్థవంతంగా నిర్వహించాలని భావిస్తున్నాం. డోర్ డెలివరీని కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించాం. ప్రస్తుతం రోజువారీ ఆదాయం పెంచాలనుకుంటున్నాం. కార్గో గురించి సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించి కార్గో ఆదాయం పెంచాలని ఆదేశించాం. – మూరే వెంకటరమణారెడ్డి, ఆర్టీసీ-1 డిపో మేనేజర్, మదనపల్లె

డోర్ డెలివరీలు బుక్ చేయాలి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవం సందర్భంగా ప్రతి ఉద్యోగి నాలుగు డోర్ డెలివరీలు బుక్ చేయాలని మదనపల్లి ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్.సి.నిరంజన్ అన్నారు. గురువారం స్థానిక టు డిపో కార్యాలయంలో సిబ్బందితో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో, ఈపీకె, కేఎంపీఎల్ పెంచాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి వారి అభిమానం చూరగొనాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ గీత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్రవాహనం ఢీకొని రైతు మృతి


మృతి చెందిన రైతు వెంకటరమణారెడ్డి

వాల్మీకిపురం : ద్విచక్రవాహనం ఢీకొని ఓ రైతు మృతి చెందిన సంఘటన పట్టణంలోని బైపాస్ రోడ్డులో చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని ప్యారంపల్లికి చెందిన రైతు వెంకటరమణారెడ్డి (75) సొంత పనుల నిమిత్తం గురువారం వాల్మీకిపురానికి బయల్దేరాడు. వాల్మీకిపురం బైపాస్ రోడ్డులోని గొల్లపల్లె మూడురోడ్ల కూడలివద్ద రోడ్డును దాటుతుండగా వెనుకవైపు నుంచి ఓ ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రైతు మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్ట్


నిందితుని అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ నాగేశ్వరరావు

వాల్మీకిపురం : హత్య కేసులో నిందితుడిగా ఉండి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. వివరాలు ఇలా.. నిమ్మనపల్లి శ్రీనివాసులు ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. అతను కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో 2021 సంవత్సరం నవంబర్ 15న చిత్తూరు సెషన్స్ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ చేసింది. గత రెండేళ్లుగా అతని ఆచూకీ కోసం వెతుకుతున్నా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ, డీఎస్పీల సూచనల మేరకు స్పెషల్ టీంను ఏర్పాటు చేశారు. ఈ టీం గాలింపు చర్యలు చేపట్టి గురువారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర వహించిన కానిస్టేబుల్ సతీష్ కుమార్, అబ్దుల్లాను అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ, రాయచోటి డీఎస్పీలు అభినందించి, రివార్డును ప్రకటించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆకట్టుకున్న పోలీసు ఆయుధాల ప్రదర్శన

- ఓపెన్ హౌస్‌ను తిలకించిన విద్యార్థులు
- అర్థమయ్యేలా వివరించిన ఎస్పీ కృష్ణారావు


ఏకే 47 గన్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న పోలీస్ అధికారి


పోలీస్ ఓపెన్‌హౌస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీస్ ఓపెన్‌హౌస్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. గురువారం పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను జిల్లా ఎస్పీ కృష్ణారావు ప్రారంభించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాల గురించి విద్యార్థులకు జిల్లా ఎస్పీ స్వయంగా వివరించారు. పోలీసుల విధులు, వారు వాడే ఆయుధాలు, బాధ్యతలు తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోవడానికి ఓపెన్‌హౌస్ కార్యక్రమం దోహదపడుతుందని ఎస్పీ అన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే స్మారకోత్సవాలలో భాగంగా పోలీసు ఆయుధాల ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు విధినిర్వహణలో వాడే ఆయుధాలు, వాటి పనితీరు, పరికరాలు సాంకేతిక సాధనలను గురించి పోలీసులు ప్రత్యేకంగా విద్యార్థులకు వివరించారు. ఈ ఓపెన్‌హౌస్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థులు తరలివచ్చి తిలకించాలని జిల్లా ఎస్పీ కోరారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి పోలీసుల పనితీరు, రికార్డుల నిర్వహణ గురించి విద్యార్థులకు వివరించామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని, క్రమశిక్షణ అలవరచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. ఈ ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో పోలీసులు వాడే జీఎఫ్ రైఫిల్, 380 రివాల్వర్, ఏకే-47, 9ఎంఎం గ్లాక్ పిస్టల్, 7.62 ఎంఎం ఎస్ఎల్ఆర్, ఫెడరల్ గ్యాస్ గన్, వియల్ పిస్టల్ 303 రాయిట్ గన్ 9ఎంఎం కార్బన్, ఇన్‌శాస్ రైఫిల్, 12 బోర్ పంప్ యాక్షన్ గన్, మెటల్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, బాంబు డిస్పోజల్ పరికరాలు, గ్రెనేడ్ హెచ్ఈ 36, పలు పరికరాలు కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్స్, అవి పనిచేసే విధానం గురించి ఎస్పీ విద్యార్థులకు, ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ప్రదర్శనను తిలకించేందుకు పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ వీబీ రాజ్‌కమల్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఆర్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంబవరంలో ఘర్షణ

వల్లూరు : మండలంలోని అంబవరం గ్రామంలో గురువారం ఘర్షణ జరిగిందని ఎస్ఐ పెద్ద ఓబయ్య తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన వాసు అనే యువకుడు గ్రామంలోని ఓబుల్ రెడ్డికి చెందిన దుకాణానికి వచ్చాడు. అక్కడ మాటా మాటా పెరిగి ఓబుల్ రెడ్డి అతనిపై దాడి చేశాడు. ఈ మేరకు బాధితుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు



కడప అర్బన్ : కడప నగర శివార్లలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో గుర్తు తెలియని నాలుగు మృతదేహాలు ఉన్నట్లు ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాలకు సంబంధించిన వారి బంధువులు వుంటే వారు తమను నేరుగా వచ్చి సంప్రదించాలని కోరారు.

పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు


వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారి

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ఏ.ఆర్. సివిల్ విభాగంలోని కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ స్థాయి వరకు సిబ్బంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ సిబ్బందికి 'సోషల్ మీడియా దుర్వినియోగం- సైబర్ మోసాన్ని ఎదుర్కోవడంలో సాంకేతికత ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీలను ఏ.ఆర్. అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ బి.రమణయ్య పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీశైలరెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, డీటీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్‌రెడ్డి, సైబర్‌సెల్ ఎస్ఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు స్వామినాయక్, అప్పలనాయుడు, పోలీస్ సిబ్బంది, న్యాయనిర్ణేతలుగా విచ్చేసిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన పంట నమోదు ప్రక్రియ

- ఖరీఫ్ సీజన్‌లో 93,311 మంది రైతులకు చెందిన 204739.9 ఎకరాలలో ఈ-క్రాప్ పంట నమోదు
- 92273 మంది రైతులు 2,01,701 ఎకరాలకు ఈకేవైసీ పూర్తి
- జిల్లా వ్యవసాయ అధికారి బి. చంద్రానాయక్


ఈ క్రాప్ నమోదు వివరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ (ఫైల్)

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో 2023 ఖరీఫ్ సీజన్ పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రా నాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో వివరాలను వెల్లడించారు. ఖరీఫ్ సీజన్‌లో 93311 మంది రైతులకు చెందిన 204739.9 ఎకరాలలో ఈ-క్రాప్ పంట నమోదు పూర్తి చేశామని తెలిపారు. అలాగే 2,01,701 ఎకరాలకుగాను 92,273 మంది రైతుల ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. అన్నమయ్య జిల్లాలో రైతులు సాగుచేసిన పంట వివరాలు ఈ-క్రాప్‌లో నమోదు చేశామని పేర్కొన్నారు. గ్రామ సభలలో పంట నమోదు వివరాలు, పంట పేరు, సాగు విస్తీర్ణం వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులు చదివి వినిపించాలన్నారు. ఈనెల 29వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాలలో సామాజిక తనిఖీకి పంట నమోదు వివరాల జాబితాను ప్రదర్శిస్తారన్నారు. సామాజిక తనిఖీ, గ్రామ సభల ద్వారా ఏవైనా పంట నమోదు వివరాలు తప్పుగా నమోదు చేసినట్లయితే సరిదిద్దడానికి అవకాశం ఉందన్నారు. గ్రామంలోని రైతులందరూ పాల్గొని పంట వివరాలను సరి చూసుకోవాలని కోరారు.

సెల్‌ఫోన్ ద్వారా ఈ-క్రాప్ వివరాలు..

ఈ-క్రాప్ నమోదు వివరాలు రైతులకు సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్ చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రసీదు కూడా ఇస్తారన్నారు. జాబితాలో తప్పిదాల సవరణకు ఇది చివరి అవకాశమన్నారు. తుది జాబితా ప్రకటనలో ఎలాంటి సవరణలు అంగీకరించరని స్పష్టం చేశారు. నవంబర్ 1వ తేదీ నాటికి తుది జాబితాను రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శిస్తారని వివరించారు.

ఈ-క్రాప్ ఆధారంగా..

ఈ-క్రాప్ ఆధారంగా పంట కొనుగోలు, పంటల బీమా, పంట నష్టపరిహారం వంటి పథకాలు రైతులకు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పంట నమోదుపై జరుగుతున్న సామాజిక తనిఖీ, గ్రామ సభలలో మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు.

అంతర్ జిల్లా మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్

- రూ.8.50 లక్షలు విలువైన 7 మోటార్ సైకిళ్లు రికవరీ
- కడప చిన్నచౌక్ సీఐ పి.నరసింహారెడ్డి వెల్లడి


మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న కడప చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి

కడప అర్బన్ : కడప నగరంతో పాటు వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మోటార్‌సైకిళ్లను దొంగతనం చేస్తున్న అంతర్‌జిల్లా మోటార్ సైకిల్ దొంగ కుప్పం మల్లికార్జునను కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి తమ సిబ్బందితో కలిసి తాడిపత్రి-తిరుపతి రహదారిలో గురువారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 8.50 లక్షలు విలువైన ఏడు మోటార్ సైకిళ్లను రికవరీ చేశారు. గురువారం సాయంత్రం కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను తెలియజేశారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెలో నివాసం ఉంటూ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న కుప్పం మల్లికార్జున జల్సాలకు అలవాటుపడి గతంలో అనంతపురం జిల్లాలో మోటార్‌సైకిళ్ల దొంగతనానికి పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడు. ఇతను కడప, తిరుపతి, మదనపల్లి, ప్రొద్దుటూరు పట్టణాలలో మోటార్ సైకిళ్లను దొంగతనం చేసేవాడన్నారు. ఈ సంఘటనలో నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన కడప చిన్నచౌక్ ఎస్ఐలు తులసీనాగప్రసాద్, పి. రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ జె. రామసుబ్బారెడ్డి, కానిస్టేబుళ్లు నాగరాజు, పీవీ శ్రీనివాసులు, బాషా, ఖాదర్‌లను కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్, జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అభినందించారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణ పక్కాగా ఉండాలి

పలు పాఠశాలల్లో ల్యాబ్‌లను తనిఖీ చేసిన రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం


ల్యాబ్ పనితీరు, విద్యార్థుల ప్రతిభను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబుల నిర్వహణ పక్కాగా ఉండాలని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు మొహమ్మద్ జాకీర్ అహ్మద్, రమేష్‌లు అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం కడప నగరంతోపాటు జిల్లాలో పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్ పని తీరును వారు రెండు బృందాలుగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పిల్లలతో మాట్లాడారు. దీంతోపాటు ల్యాబ్ పనితీరు, నిర్వహణ నిధులు వినియోగం, టైమ్ టేబుల్‌లో ఇస్తున్న ప్రాధాన్యతతోపాటు పిల్లల్లో నైపుణ్యాలను పరిశీలించారు. త్వరలోనే నిర్దేశించిన విధివిధానాల ప్రకారం ల్యాబ్ నిర్వహణ చేయాలని సిబ్బందికి సూచించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సక్రమంగా నిర్వహించి విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్సు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వీరి వెంట సమగ్రశిక్ష ఏఎంఓ ధనలక్ష్మి, ఏఏఓంఓ రామాంజనేయరెడ్డితోపాటు పలు మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. కోటవారిపల్లె పంచాయతీ అడవి లోపల్లెకు చెందిన నాగప్ప కుమారుడు జి.వెంకటరమణ(80) ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలోని రామాపురం ఆంజనేయస్వామి గుడి వద్ద ఆటో వెనుకవైపు ఢీకొంది. ప్రమాదంలో వెంకటరమణ తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజంపేట రూరల్ : మండలంలోని ఊటుకూరు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ సీఐ పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. బుధవారం ఊటుకూరు సమీపంలో ఓ వ్యక్తి మూర్ఛ వచ్చి పడిపోయి ఉండగా స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. 108 వాహనంలో ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు కడప రిమ్స్‌కు తీసుకెళ్లామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తెలుగుగంగ భూములు అన్యాక్రాంతం

- భూమి ఆక్రమించి కంచె వేసిన వైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ


శ్రీనివాసపురం వద్ద తెలుగుగంగ కాలువను ఆక్రమించి కంచె వేసిన దృశ్యం


తెలుగుగంగ కాలువ అన్యాక్రాంతం కావడంతో కాలువలో దారి కోసం అడ్డుగా వేసిన మట్టికట్ట

గోపవరం : మండలంలోని తెలుగుగంగ భూములు అన్యాక్రాంతమయ్యాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవవడంతో ఈ దుస్థితి నెలకొంది. 2008లో బ్రహ్మంసాగర్ నుండి తెలుగుగంగ ఎడమ కాలువ ద్వారా సాగునీరు అందించేందుకు కాలువలు తవ్వించారు. పదేళ్లు కాలువలన్నీ నిరుపయోగంగా ఉండేవి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని చెరువులకు తెలుగుగంగ కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోపవరం చెరువుకు సాగునీరు అందించే తెలుగుగంగ కాలువ పూర్తిగా అన్యాక్రాంతమైంది. కాలువకు ఇరువైపులా ఉన్న భూములను ఆక్రమించి ఏకంగా కంచె కూడా ఏర్పాటు చేశారు. దీంతో దిగువ ప్రాంతంలో ఉన్న సాగు భూముల వద్దకు వాహనాలతో పాటు రైతులు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అధిక శాతం కాలువలకు ఇరువైపులా ఉన్న భూములన్నీ కూడా అన్యాక్రాంతమయ్యాయి. గోపవరం రెవెన్యూ పొలం 124 సర్వే నెంబరులో శ్రీనివాసపురం సమీపంలో తవ్విన కాలువకు సంబంధించి దాదాపు 60 అడుగుల మేర ఇరువైపులా భూములను ఆక్రమించి కంచె వేశారు. దీంతో పొలాలకు వెళ్లేందుకు దారి లేక పోవడంతో కాలువకు అడ్డంగా మట్టితో అడ్డుకట్ట వేసి దారి కోసం ఉపయోగించుకుంటున్నారు. సకాలంలో వర్షాలు కురిసి కాలువలకు సాగునీరు వచ్చినా గోపవరం చెరువుకు వచ్చే కాలువ ద్వారా సాగునీరు వచ్చే పరిస్థితి లేదు. సంబంధిత అధికారులు అన్యాక్రాంతమైన కాలువను పరిశీలించి కాలువకు అడ్డంగా వేసిన కట్టను తొలగిస్తే తప్ప నీరు రాదు. తెలుగుగంగ భూములు అన్యాక్రాంతం కావడం పట్ల తహసీల్దార్ దామోదర్‌రెడ్డి ఏమన్నారంటే తెలుగుగంగ అధికారులు కాలువలను పరిశీలించి ఆక్రమణకు గురైనట్లు గుర్తించి తమ దృష్టికి తీసుకువస్తే రెవెన్యూ సిబ్బంది ద్వారా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అప్పుడు సంబంధిత అధికారులు భూములు అన్యాక్రాంతం కాకుండా బోర్డులు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కాగా తెలుగుగంగ భూములు అన్యాక్రాంతమైన విషయాన్ని విజయవాడలోని జలవనరులశాఖ కార్యాలయంలో ఈఎన్‌సీ అధికారులకు ఈ ప్రాంత వాసులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అన్యాక్రాంతమైన భూములను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

కుందూతీరం.. ఆహ్లాదకరం


కుందూనదిలో అరకొరగా పారుతున్న నీరు


పచ్చగా ఉన్న వరిపంట

రాజోలి ఆనకట్ట నుంచి మొదలయ్యే కుందూనది తీరం వెంబడి కొంతమంది రైతులు అరకొరగా వస్తున్న నీటిని నమ్ముకొని వరి పంటను సాగుచేశారు. ప్రస్తుతం ఆ పంట వెన్నుదశలో ఉంది. మధ్యాహ్న సమయంలో ఎండలు విపరీతంగా ఉండటంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులకు చల్లని గాలి ఆహ్లాదాన్ని పంచుతోంది. – రాజుపాళెం